సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి ...
శనివారం 01 మార్చి 2025 , పేజీలు 04
అదిలాబాద్ - మంచిర్యాల
సూర్య
www.suryaa.com
★ నిర్మల్ ★ కొమురంభీం ఆసిఫాబాద్



### 10వ తరగతి వార్షిక పరీక్షలను

# పకడ్బందీగా నిర్వహించాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాదు బ్యూరో,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో మార్చి 21 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, అదనపు ఎస్. పి. ప్రభాకర్ రావు, ఇన్చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యతో కలిసి పోలీస్, రెవెన్యూ, విద్యా, గిరిజన, షెడ్యూల్డ్ కులములు, వెనుకబడిన తరగతులు,మైనారిటీ,రవాణా,వైద్య ఆరోగ్య,ఆర్.టి.సి.,తపాలా,గ్రామీణ నీటి సరఫరా,ఖజానా శాఖల అధికారులతో వార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షల కొరకు 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 6 వేల 779 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థుల కొరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని, ఫర్నిచర్, ఫ్యాన్లు, వెలుతురు, త్రాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీరు అందించాలని, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్య-ఆరోగ్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓ. ఆర్. ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆర్.టి.సి. అధికారులు పరీక్షా సమయం సమయానికి అనుగుణంగా బస్సులు నడిపించాలని, గ్రామీణ నీటి సరఫరా శాఖ సిబ్బంది సుద్ధమైన త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని,విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పరీక్షలు జరిగే సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని తెలిపారు. తపాల శాఖ ఆధ్వర్యంలో జవాబు పత్రాలను తరలించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయం ప్రారంభానికి గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని, పరీక్షా కేంద్రంలోనికి చరవాణిలకు అనుమతి లేదని తెలిపారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత అధికారులు వారంలోగా పరీక్షా కేంద్రాలను సందర్శించి అవసరమైన ఏర్పాట్లపై నివేదికలు రూపొందించాలని తెలిపారు. పరీక్షల నిర్వహణ సక్రమంగా ఉండేందుకు ముఖ్య పర్యవేక్షకులు ఇన్విజిలేటర్లకు శిక్షణ అందించాలని, సంక్షేమ శాఖల వసతి గృహాలలో, ఆశ్రమ పాఠశాలలలో చదివే విద్యార్థులు అందరూ పరీక్షలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిషనర్ ఉదయ్ బాబు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, జిల్లా రవాణా అధికారి రామ్ చందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రంజాన్ పండుగను శాంతియుత

# వాతావరణంలో జరుపుకోవాలి

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్**

జిల్లాలో రంజాన్ పండుగను ప్రజలకు శాంతియుత వాతావరణంలో సామరస్యంగా జరుపుకోవాలని, సంతోషంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సజావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ, మంచిర్యాల, జైపూర్ ఎ.సి.పి.లు



ప్రకాష్, వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి హరీష్ రాజ్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు లతో కలిసి మండలాల తహశిల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, ముస్లిం మత పెద్దలతో రంజాన్ పండుగ వేడుక నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పండుగలను ప్రజలంతా సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. రంజాన్ మాసం, ఈద్-ఉల్-ఫితర్ పండుగ నిర్వహణ కొరకు సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు 'చేయాలని తెలిపారు. ( మిగితా..2లో )

### తాడిహత్నూర్ ఉన్నత పాఠశాలను

# సందర్శించిన కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్(నార్నూర్ )ఫిబ్రవరి 28 సూర్య మేజర్ న్యూస్**

నార్నూ ర్ మండలం తాడిహత్నూర్ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో డిజిటల్ క్లాసులను శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. డిజిటల్ క్లాస్ రూమ్ సదుపాయాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ వారి ఆర్థిక సహాయంతో సీఎస్ఆర్ నిధులతో



మారుమూల ప్రాంతాల్లో విద్యార్థులకు ఆధునిక విద్య అందించే దిశగా ముందుకు వెళుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న వసతులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని,విద్య పై అధిక శ్రద్ధ వహిస్తూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని ఆన్నారు.అనంతరం నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మనోహర్, ఉపాద్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి

### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

**ఆదిలాబాదు ఉమ్మడి జిల్లా ప్రతినిధి సూర్య మేజర్ న్యూస్ :**




రాష్ట్రవ్యాప్తంగా మార్చి 5వ తేదీ నుండి 25వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఇంటర్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు పోలీసు ఉన్నత అధికారులు, జిల్లా అధికారులతో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఇంటర్ వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.

జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, అదనపు ఎస్.పి. ప్రభాకర్ రావు, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వరరావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కొరకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. మార్చ్ 5వ తేదీ నుండి 25వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, దాదాపు 10 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.పరీక్ష కేంద్రాలలో సరిపడా ఫర్నిచర్, ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు శుద్ధమైన త్రాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.



ప్రతి పరీక్ష కేంద్రంలో అత్యవసర వైద్య సేవలు నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, వేసవికాలం దృష్ట్యా ఓ. ఆర్. ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు (మిగితా2లో)

## ఘనంగా టైలర్స్ దినోత్సవం

**మందమర్రి,ఫిబ్రవరి28,సూర్య మేజర్ న్యూస్.**



టైలర్స్ డే ను పురస్కరించుకొని పట్టణ మేరు సంఘం ఆద్వర్యంలో మార్కెట్ హనుమాన్ ఆలయంలో వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కెట్ వ్యాపార వర్తక సంఘం అధ్యక్షులు తమ్మిశెట్టి విజయ్, మార్కెట్ కమిటీ ప్రధాన కార్యదర్శి మంద తిరుమల్ రెడ్డి, గంప ఆంజనేయులు పాల్గొని కులసంఘం నాయకులు, వ్యాపారస్తులతో కలిసి మేరు కుల దైవం శంకర దాసమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ దర్జీ లేని సమాజాన్ని ఊహించలేమని అన్నారు. శరీరాన్ని అందంగా తీర్చిదిద్దే బట్టలు, ఆడంబరమైన దుస్తులు డాంబికతను సూచించడంతోపాటు వ్యక్తి సంస్కారాన్ని తెలియజేస్తాయని, తమ నేర్పరితనంతో దుస్తులు కుట్టడంలో మేదర్లదీ కీలక పాత్ర అని ప్రశంసించారు. మేరు కులస్తులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేస్తుందని వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా రాణించాలని కోరారు. అనంతరం మేరు సంఘం నాయకులు రాయబారపు వెంకన్న, రాయబారపు జనార్ధన్ లు మాట్లాడుతూ దుస్తులతో మనిషి హుందాతనాన్ని తీసుకువస్తున్న దర్జీల బతుకుల్లో మాత్రం దర్జా మాయమవుతుందని, రెడీమేడ్ దుస్తుల రాకతో ఉపాధి కరువైందని, కులవృత్తినే నమ్ముకున్న వారి పరిస్థితి దయనీయంగా మారిందని దర్జీలు దర్జాగా బ్రతికే రోజులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దర్జీ వృత్తిని నమ్ముకున్న వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, టైలర్ షాపులకు ఉచిత విద్యుత్తు, కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీపై రుణాలు అందించి దర్జీ వృత్తిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి రవీందర్, పట్టణ ఉపాధ్యక్షులు రాయబారపు కిరణ్, గట్ల సారంగపాణి, కోశాధికారి సూర్యనారాయణ, కర్నె వెంకన్న, గంగాధర్, లక్ష్మణ్, రవి, సుజిత్, రాము, సూర్య ప్రకాష్, సత్యనారాయణ, శ్రీనివాస్, రాజీనా, రాజు, కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


## దొంగల స్వైర విహారాన్ని అరికట్టండి

**తాండూర్,ఫిబ్రవరి 28, సూర్య మేజర్ న్యూస్**

మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలో దొంగల స్వైర విహారం ఆశ్చర్యం కలిగిస్తోందని మండల ప్రజలు పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్




క్లబ్ ఐబీ తాండూరులో నిర్వహించిన ప్రెస్ మీట్ లో స్థానిక ప్రజలు మాట్లాడుతూ ఈ నెల ఫిబ్రవరి 25 న సుమారు రాత్రి 12 గంటల సమయంలో ముగ్గురు యువకులు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు అక్కడక్కడ ఉన్న సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయని తాండూర్ బస్ స్టాండ్ నుంచి యూనియన్ బ్యాంక్ వరకు నడుచుకుంటూ వచ్చిన దొంగలు మధ్యలో ఒక ఇంటి సందులో ఒక బైకును దొంగలించబోయి అక్కడున్న సీసీ కెమెరాను చూసి వెను దిరిగారని అన్నారు .కాస్త



ముందుకు రాగానే యూనియన్ బ్యాంకు సమీపంలో సీసీ కెమెరా లేదని నిర్ధారించుకొని ఇంటి ముందు నిలిపి ఉంచిన హీరో హోండా గ్లామర్ బైకును దొంగలు ఎత్తుకెళ్లారని ఇంటి యజమాని ఫిర్యాదు చేసాడని అన్నారు. దొంగలు తిరుగుతున్నారనే విషయం ఆ నోట ఈ నోట తాండూర్ మండలం వ్యాప్తంగా వ్యాపించిందని మొన్నటికి మొన్న దొంగలు కాసిపేట శివారులో రైతులకు ఉపయోగపడే కరెంట్ కాపర్ వైర్లను దొంగలించడం కూడా జరిగిందన్నారు.రాత్రి సమయంలో ఎటిఎంలలో ,ప్రధాన కూడళ్లలో ప్రతి గ్రామంలో పోలీస్ బుక్ ఎంట్రీ చేస్తూ పెట్రోలింగ్ పెంచాలని మండల ప్రజలు దాసరి శ్రీనివాస్, జైన సాంబయ్య, పుల్గం రాజేందర్, చాపిడి ప్రశాంత్,చరణ్, ప్రశాంత్‌లు కోరుతున్నారు.

### ఇంటర్ వార్షిక పరీక్షలను జిల్లాలో

# సమర్థవంతంగా నిర్వహించాలి.

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,ఫిబ్రవరి28, సూర్య మేజర్ న్యూస్ :**



జిల్లాలో మార్చి 5 నుండి 26వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్,



మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కొరకు 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 4 వేల 965 మంది జనరల్, 935 మంది ఒకేషనల్, ద్వితీయ సంవత్సరంలో 5 వేల 625 మంది, 1 వేయి 15 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్, త్రాగునీరు, ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో అత్యవసర వైద్య సేవలు నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓ. ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా వైద్య-ఆరోగ్యశాఖ అధ్వర్యంలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా రూట్లలో ఆర్.టి.సి. అధికారులు సమయానుసారంగా బస్సులు నడిపించాలని తెలిపారు. పరీక్ష ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలను, బందోబస్తు మధ్య ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తపాలా, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగే విధంగా విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### వచ్చే విద్యా సంవత్సరానికి

# అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,ఫిబ్రవరి28, సూర్య మేజర్ న్యూస్ :**

2025-26 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్తో కలిసి గ్రామీణాభివృద్ధి, విద్య, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి. వెనుకబడిన తరగతులు, మైనార్టీ సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి విద్యార్థులకు ఏకరూప దుస్తులు, అభివృద్ధి పనుల నిర్వహణ' అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 'విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసించే విద్యార్థినీ, విద్యార్థులకు ఏకరూప దుస్తులు విద్యా సంవత్సరం "ప్రారంభానికి ముందే తయారు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తరగతుల వారిగా విద్యార్థినీ, విద్యార్థులకు సంబంధించిన కొలతలు తీసుకొని జిల్లాలో గుర్తించబడిన 630 స్వయం సహాయక సంఘాల సభ్యుల సమన్వయంతో ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ఎం.బి. రికార్డులు పూర్తి అయిన వాటికి



చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సంక్షేమశాఖల పరిధిలో విద్యార్థినీ, విద్యార్థుల సంక్షేమం దిశగా వసతిగృహాల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని సంక్షేమ వసతి గృహాలలో తప్పనిసరిగా నిద్ర చేయాలని, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతిగృహంలో కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించాలని, విద్యార్థులకు అందించవలసిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. దినపత్రికలలో ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు తక్షణమే స్పందించి వివరణ అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సాహితీ పురస్కార ప్రదాన కార్యక్రమంకు ఆహ్వానం

**మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 28,సూర్య మేజర్ న్యూస్ :**

కవి తెలుగు పండితులు రేవెల్లి రామయ్యకు జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో సాహితీ పురస్కార ప్రదాన కార్యక్రమం మార్చి 02,ఆదివారం న మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల లో జరుగుతుంది అని జిల్లా సాహితీ సంరక్షణ సమితి మంచిర్యాల అధ్యక్షులు దండనాయకుల వామన్ రావు, ప్రధాన కార్యదర్శులు అల్లాడి శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంకు కవులు,కళాకారులు, రచయితలు,బంధువులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్య లో రావాలని, విజయవంతం చేయాలని దండనాయకుల వామన్ రావు,అల్లాడి శ్రీనివాస్ కోరారు.

## పగిడిగూడ గిరిజన గ్రామంలో

## దోమల మందు పిచికారీ, వైద్య శిబిరం

**వాంకిడి ఫిబ్రవరి 28సూర్య మేజర్ న్యూస్**

వాంకిడి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామమైన పగిడిగూడలో శుక్రవారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దోమలమందు పిచికారీ చేపట్టారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామస్తులకు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 34 మందిని పరీక్షించగా, జ్వరంతో బాధపడుతున్న ఇద్దరి రక్త నమూనాలను సేకరించి వారికి మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, హెల్త్ అసిస్టెంట్లు పుష్ప, భగవాన్ దాస్, ఆశా కార్యకర్త కమల పాల్గొన్నారు.



## నేతకాని మహార్ కులానికి ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేయండి

### - జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు నేతకాని

**మందమర్రి, ఫిబ్రవరి 28, సూర్య మేజర్ న్యూస్.**

సామాజికంగా విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో వెనకబడిన నేతకాని మహార్ కులానికి ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేసి కులానికి న్యాయం చేయాలని కోరుతూ ఎస్సి వర్గీకరణ ఏకసభ్య కమీషన్ ఛైర్మన్ కు నేతకాని మహార్ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు నేతకాని వినతిపత్రం అందజేశారు. నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ ఆదేశాల మేరకు హైదరాబాద్ బూర్గుల రామకృష్ణ రావు భవన్ లో శుక్రవారం ఎస్సి వర్గీకరణ ఏకసభ్య కమీషన్ ఛైర్మన్ డా షమీమ్ అక్తర్ కు నేతకాని మహార్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణలో గ్రూప్ 1, 2, 3 కి బదులుగా ఎ, బి, సి, డి లను ఏర్పాటు చేసి నేతకాని, మహార్ ను గ్రూప్ సిలో ఉంచి, మాల మరికొన్ని అభివృద్ధి చెందిన కులాలను గ్రూపు డి లో చేర్చాలని డా.షమీమ్ అక్తర్ ప్రభుత్వానికి ఇచ్చిన వర్గీకరణ నివేదికలో మాలసాలె, నేతకానీలను గ్రూపు-3 లో చేర్చడం కాక,మాలసాలె తెలంగాణ రాష్ట్రంలో లేదని, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో ఉంటుంది కాని నేతకాని కులం 1,33,072 జనాభా కలిగి మాల, మాదిగల తరువాత 3వ స్థానంలో ఉన్న అతిపెద్ద దళిత కులం నేతకాని కులం అని అన్నారు. నేతకానీలు ఆసిఫాబాద్, కాగజనగర్, ఆదిలాబాద్ ప్రాంతాలలో మహార్ లుగా సర్టిఫికెట్స్ కలిగి 31,938 జనసంఖ్యతో ఉన్నారని తెలియజేసారు. నేతకాని కులానికి ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేయాలనీ, అంతేకాక గ్రూపు బిలో ఉండి 4వ స్థానంలో 1,11,710 ఉన్న బేడ, బుడగ జంగాలకు, మరికొన్ని కులాలు కలిపి 1,71,682 తో గ్రూపు-1గా ఏర్పాటు చేసిన నేపథ్యంలో సామాజికంగా, విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో వెనకబడి ఏజెన్సీ ప్రాంతాలలో ఏలాంటి హక్కులు లేకుండా పేదరికంలో మగ్గుతున్న 3వ అతిపెద్ద 1,33,072 " నేతకాని కులానికి, "మహార్ " మరికొన్ని కులాలను కలిపి గ్రూపు సి లో ఉంచి మెరుగైన ప్రయోజనాలను పొంది, అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన మాల, ఇతర కులాలను గ్రూపు డి లో చేర్చి అన్ని రంగాలలో వెనుకబడ్డ నేతకాని కులానికి న్యాయం చేయాలని ఎస్సి వర్గీకరణ ఏకసభ్య కమీషన్ ఛైర్మన్ ను సునార్కర్ రాంబాబు కోరారు. ఈ కార్యక్రమంలో జాడి గంగాధర్ నేతకాని మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మహిళ జిల్లా అధ్యక్షురాలు కామెర అనూష, రాష్ట్ర యువజన అధ్యక్షులు అనపర్తి యువరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సంతోష్, నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుమ్మిడి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన టీబీజీకేఎస్ నాయకునికి ఘనంగా సన్మానం

**మందమర్రి, ఫిబ్రవరి 28, సూర్య మేజర్ న్యూస్.**

మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిలో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన టీబీజీకేఎస్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒడ్నాల రాజన్న దంపతులను టీబీజీకేఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం గనిపై నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో ఒడ్నాల రాజన్న క్రియాశీల పాత్ర పోషించారని ఆయన సేవలను ఆయన కొనియాడారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుండే రాజన్నను పలువురు కార్మికులు నాయకులు ఆదర్శంగా తీసుకొని కార్మిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిజికెఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జే రవీందర్, సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ, ఓ రాజశేఖర్, సెంట్రల్ నాయకులు సీహెచ్ వెంకటరమణ, నాయకులు ఇప్ప సమ్మయ్య, వీరారెడ్డి, సీపెల్లి రాజలింగు, బెల్లం అశోక్, బైరి శంకర్, అఫ్జలుద్దీన్, కొప్పుశ్రీనివాస్, తిరుపతి, బెల్లం అరుణ్, రంజిత్, అందె శ్రీకాంత్, రామునూరి రాజేష్, పాణి ప్రతాప్, సీనియర్ నాయకులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.నన

### ఇంటర్మీడియట్ పరీక్షలను

# పకడ్బందీగా నిర్వహించాలి

### - ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు ఎస్పీలతో సిఎస్ సమీక్ష సమావేశం

### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి.

**నిర్మల్ ఫిబ్రవరి 28, సూర్య మేజర్ న్యూస్**

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు ఎస్పీలతో సిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, జిల్లాలలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. పరీక్ష విధులు నిర్వహించే అధికారులందరికీ శిక్షణ కల్పించాలన్నారు. జిల్లాల వారీగా ఇంటర్మీడియట్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థుల సంఖ్య, పరీక్షా కేంద్రాల సంఖ్య, పరీక్షల నిర్వహణలో పాల్గొనబోయే సిబ్బంది, తదితర వివరాలను కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలను అత్యవసర మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. పరీక్షల ప్రక్రియ పూర్తయింతవరకు అన్ని సందర్భాలలో పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని అన్ని జిల్లాల ఎస్పీలను సిఎస్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలోని జిరాక్స్ దుకాణాలను మూసివేసి, 144 సెక్షన్ ను అమలు పరచాలన్నారు.అలాగే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం నూతన నిర్ణయాలు తీసుకుందన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ రుసుములో 25 శాతం రాయితీని కల్పించినట్లు తెలిపారు. మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ గడువు ముగుస్తుంది తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో సమీక్షిస్తూ, జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో కలుపుకొని 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాల్లో 6571 మంది ప్రథమ సంవత్సర, 6562 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు మొత్తం కలిపి 13133 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నట్లు తెలిపారు. మార్చి 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ల అంశంపై కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్ఆర్ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ) దరఖాస్తుదారులంతా క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల రిజిస్ట్రేషన్ రుసుములో 25 శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులంతా రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాలని తెలిపారు. మార్చి 31 వ తేదీతో లే అవుట్ల దరఖాస్తుల రుసుము చెల్లించే గడువు ముగుస్తుందన్నారు. గడువు ముగిసిన తర్వాత మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉండదని, కావున దరఖాస్తుదారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన రుసుములు చెల్లించాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఎస్పి జానకి షర్మిళ, అదనపు ఎస్పీ ఉపేంద్ర రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరుశురాం, డీఈఓ పి. రామారావు, డిపిఓ శ్రీనివాస్, డి ఎం ఆర్టిసి ప్రతిమారెడ్డి, డిఎంహెచ్ఓ రాజేందర్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, జాదవ్ కృష్ణ, రాజేష్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ నిల్వలపై రెవెన్యూ అధికారుల దాడి

### - 30 ట్రాక్టర్ల ఇసుక సీజ్

**మందమర్రి, ఫిబ్రవరి 28, సూర్య మేజర్ న్యూస్.**

మందమర్రి మండలంలోని పులిమడుగు గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిలువ చేసిన సుమారు 30 ట్రాక్టర్ల ఇసుకను రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. అక్రమంగా నిలువ చేసి ఇతరుల అవసరాలకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు మండల తహసిల్దార్ సతీష్ ఆదేశాలతో మండల గిర్దవార్ (రెవెన్యూ ఇన్స్పెక్టర్) గణపతి పోలీసు సిబ్బంది తో కలిసి అక్రమంగా డంపు చేసిన ఇసుకను స్వాధీనం చేసుకున్నారు.

## మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

### - పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్

**మందమర్రి, ఫిబ్రవరి 28, సూర్య మేజర్ న్యూస్.**

సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 8 వ తారీఖున సిఈఆర్ క్లబ్ లో జరుగు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో మందమర్రి ఏరియాలోని ఉద్యోగుల కుటుంబ సభ్యులు (మహిళలు), మహిళా ఉద్యోగులు, చుట్టుపక్కల గ్రామాల మహిళలు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 4 వ తారీకు ఉదయం పది గంటలకు సిఈఆర్ క్లబ్ లో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించబడునని ఇట్టి పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 8 వ తారీఖు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున సిఈఆర్ క్లబ్ లో మహిళా దినోత్సవ కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పోటీల్లో గెలుపొందిన మహిళలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా మొదటి, రెండవ, మూడోవ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులను సైతం అందజేస్తామని వారు తెలిపారు.

## మోడల్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

**మందమర్రి, ఫిబ్రవరి 28, సూర్య మేజర్ న్యూస్.**

జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మోడల్ పాఠశాలలో సీవీ రామన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్నీమ్ మాట్లాడుతూ సైన్స్ కు మన జీవితంతో విడదీయరాని సంబంధం ఉందని, ఈరోజు మనం అనుభవిస్తున్న అన్ని రకాల సౌలభ్యాలు సౌకర్యాలు సైన్స్ వల్లనేనని అందుకు కృషిచేసిన శాస్త్రవేత్తలకు మనం రుణపడి ఉన్నామని అన్నారు. విద్యార్థులు మాత్రమే కాకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ శాస్త్రీయ అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలోని మూఢత్వాన్ని తొలగించగలమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ ప్రదర్శన, రంగోలి, క్విజ్ వ్యాసరచన తదితర అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడమే కాకుండా వారు స్వయంగా తయారుచేసిన పరికరాల గురించి వాటి పని విధానం గురించి వివరించిన విధానం పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కు బదిలీపై వెళ్తున్న అధికారికి ఘన సన్మానం

**మందమర్రి, ఫిబ్రవరి 28, సూర్య మేజర్ న్యూస్.**

మందమర్రి ఏరియాలోని కేకే గ్రూప్ ఏజెంట్ గా విధులు నిర్వహించి పదోన్నతిపై కొత్తగూడెం కార్పొరేట్ కు బదిలీపై వెళుతున్న రామదాసును ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ జి దేవేందర్, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. జిఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క అధికారికి ఉన్నత పదవులు రావడంతో పాటు స్థాన చలనం అనివార్యమని అన్నారు. విధి నిర్వహణలో ఏరియాకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం విజయ ప్రసాద్, జనరల్ మేనేజర్ కార్యాలయం, అన్ని గనులు, డిపార్ట్మెంట్ల హెచ్ఓడిలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపికి చిత్తశుద్ధి ఉంటే బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి మాదిగలకు ఇవ్వాలి

### - మాదిగ హక్కుల దండోరా

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 28, సూర్య మేజర్ న్యూస్:**

నాగార్జునసాగర్, హరిత విజయ విహార్ హోటల్లో నిర్వహించిన దండోరా రాష్ట్ర మహాసభలలో భాగంగా మాదిగ హక్కుల దండోరా జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణ త్యాగం చేసిన అమరుల చిత్రపటానికి నివాళులర్పించి,మౌనం పాటించి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షులు దండు సురేందర్ మాదిగ మరియు రాష్ట్ర అధ్యక్షులు కొంగరి శంకర్ మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు మాదిగ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దళితుల పైన సవతి తల్లి ప్రేమ చూపిస్తుంది. భారతీయ జనతా పార్టీ కి చిత్తశుద్ధి ఉంటే ఎస్సి వర్గీకరణ బిల్లు పార్లమెంటులో పెట్టి చట్టం చేసేది కానీ అలా చేయలేదు. మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాలలో దళితుల ఎన్నో ఏళ్ల సమస్యను మేము తీర్చమని గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ



నిజంగా మాదిగలపై బిజెపికి ప్రేమ ఉంటే తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్ష పదవి మాదిగలకు కేటాయించాలి అని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం మాదిగలకు దక్కల్సిన రిజర్వేషన్ దక్కలేదని కాబట్టి చట్టం చేసే లోపు దీన్ని సవరించి మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణ త్యాగం చేసిన అమరుల యొక్క కుటుంబాలకు హైదరాబాదులో 250 గజాల భూమిని కేటాయించాలని మరియు అమరవీరుల స్మారక భవనాన్ని హైదరాబాద్ నగరంలో నిర్మించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం సమర్థవంతంగా అమలు చేసి ఆ చట్టం ద్వారా అధిక శాతం జనాభా కలిగిన మాదిగలకు ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు. సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే దళితులకు 10 లక్షల రూపాయలు మంజూరు చేయాలి అని, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకంగా గతంలో మాదిగల కేటాయించిన లిడ్ క్యాప్ భూములపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసి ఆ భూముల లో ఉత్పత్తుల తయారీ కేంద్రాలలో మాదిగలకు ఏకస్వామ్యం కల్పించాలి. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో కేటాయించిన అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాలను మంజూరు చేయాలి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల శ్యామ్ మాదిగ ,రాష్ట్ర అధికార ప్రతినిధి సగ్గి ప్రకాష్ మాదిగ, మాదిగ స్టూడెంట్ యూనియన్ కోఆర్డినేటర్ బొర్ర శాంతి కుమార్,రాష్ట్ర కార్యదర్శి.అరికిల్లా దుర్గయ్య, రాష్ట్ర కార్యదర్శి.వారికిళ్ల రాజయ్య,మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి.ఆకునూరి.రాజ్ కుమార్ ,బెల్లంపల్లి నియోజక వర్గ చెరికల ఇంచార్జి. గోగర్ల శేఖర్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు ఎనగందుల శివాజీ, మందమర్రి పట్టణ కన్వీనర్ కోలుగురి విజయ్ కుమార్, మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.